
# తిట్ల మామయ్య

## తుట్టగుంట కల్పనా భారతి

''నేనొక పాపిని! కాదు పాపిష్నరని!! కాదు ..కాదు... పాపాలెన్నో చేసిన పాపాత్ముల్లోకెల్లా పరమ... ఊహూ మహా...పాపిని!!!'' ఆవేశంగా అన్నాడు మా బాబాయి ఉన్నట్టుండి ఏదో గుర్తుతె చ్చుకు మరీ!

'తిట్ల రంగనాథం' అని పిలవబడే మా బాబాయి ఇతరులని ఇరవైనాలుగ్గంటలూ తిట్టడమే కానీ ఇలా తనని తాను తిట్టుకోవడం తెలియని నేను తెగ ఆశ్చర్య పోయాను. పిల్లలు మాత్రం నా చెవిలో గుసగుసగా,

''మమ్మీ! తాతయ్య డైలాగ్‌లో ఎన్ని 'పా'లున్నాయో తెలుసా?'' అని నన్నడి గారు! టివి క్విజ్‌లు చూసిన ఎక్స్‌పీరియన్స్ వాళ్లది! మా సంగతిలా వుంటే, మా పంకజం పిన్ని మాత్రం పరధ్యానంగా,



''ఇప్పుడెందుకండీ గతం తవ్వి ఆ పచ్చి నిజాల్ని నెమరేసుకోడం?'' అనేసి నాలుక్కరుచుకుంది. మొగుడి డైలాగ్ పూర్తవగానే!

బాబాయి వెంటనే తోకతొక్కిన తాచులా లేచి అరిచేడు. ''ఛంపేస్తా... పుండాకోర్, వెటకారాలాడేవంటే!అసలిదంతా నీ వల్లే! వాడు..., ఆ పింజారీ పిచిక, కుంజారీ కుంక, ఆ బోడి గుమ్మడిపండు రాస్కేల్, కొడుకు పెళ్లికి రమ్మన్నాడే అనుకో, 'అలాగే అన్నయ్యగారూ!' అని మాటిచ్చి చచ్చావ్! నీ మాటకోసం నేను కూడా అథమాథమ వెధవలాగా బుర్రలేని బుడంకాయలాగా నీతో పాటు వాళ్లింట్లో పెళ్లికి రావాల్సొచ్చింది కదే బూడి దగుమ్మడికాయ్!''కోపంతో ముక్కుపుటాలదిరేయి బాబాయ్‌కి! చెప్పా నుగా మా పిన్నికి పరధ్యానమని! ఆమె వెంటనే...

''అదేవిటండీ మిమ్మల్ని మీరు బుడంకాయతో పోల్చుకున్నారు?! అక్క డికీ మీరు ఆరడుగులకి ఒక్క అడుగేగా తక్కువ?'' అంది. ఆ సీన్‌లో వున్న వాళ్లు ఆమె మొహం చూస్తే ఆ మాటలు అమాయకత్వంతో అన్నవో, గడు సుగా అన్నవో తెలీక పీక్కు ఛావాల్సిందే!

''ఎగతాళి చేసేవంటే తాడుతో ఉరేస్తా అక్కుపక్షీ! ప్రాసకోసం పాకు లాడి... ఏదో బుర్రలేని బుడంకాయన్నాను. కానీ, నేనేదో పొట్టోణ్ణి కాదు నా ఉద్దేశం అర్థమయ్యిందా? ఫో! కాఫీ పట్రా ఫో'' అని ఉరిమి మరీ బాబాయి పిన్నిని వంటింట్లోకి తరిమేడు. బిక్కు బిక్కు మంటూన్న నా పిల్లల్ని తీసుకొని నేను కూడా పిన్నితో వంట గదిలోకి వెళ్లాను.

★★★

''అతను తిట్టే తిట్లకి భయపడి నేనే నా సొంత మేనమామ అయినా, వాళ్లింటికి వెళ్లడం మానేసి చాలా కాలమయ్యింది. అత్తయ్య పిలిచింది కదాని నువ్వు పిల్లల్నేసు కుని రాజమండ్రిలో వాళ్లింటికి వెళ్తానంటు న్నావు. రేపాయన తిట్లు భరించలేక ఒక్క రోజులోనే తిరుగుప్రయాణం కడతానంటే బావుండదు. వెళ్లే ముందు ఒక్కసారి ఆలో చించు. ఈ దసరా సెలవులు పిల్లల్ని ఎంజాయ్ చెయ్యనీ'' అంటూ శ్రీవారు నాకెంత నచ్చజెప్పజూశారు.

అయినా పిన్ని ఎంతో ప్రేమగా పిల్చిన ఫోన్ పిలుపు నా చెవిలో గింగురుమనడంతో, మొండిగానే పిల్లల్ని తీసుకొని వచ్చాను. పైగా ఆయన తిట్లు ఎంటర్‌టైనింగ్‌గా వుంటాయని శ్రీవారు పిల్లలకెప్పుడో చెప్పార్ట. దాంతో వాళ్లు ఉత్సాహంగానే రాజమండ్రికి బయల్దేరారు.

★★★

''వాడొక లుచ్ఛాతిలుచ్ఛా అని, పరమదగు ల్బాజీ అని, నీచాతి నీచ్ కమీనాని, పరమ లఫంగనీ, తెలిసీ, తెలిసీ వాడి కొడుకు పెళ్లికి

వెళ్లానంటే ఖచ్చితంగా నేనొక మెంటల్ మెంతిగాణ్ని, వెర్రి వెంగళప్పనీను!'' బాబాయ్ తిట్లు మాకు వంటింట్లోకి వినపడుతున్నాయి. అవతలి వారితో సమానంగా తనని తాను తిట్టుకుంటున్న బాబాయి ధోరణి అర్థం కాక పిన్ని వైపు నేను, పిల్లలూ ఒకేసారి చూసేం.

''ఎరక్కపోయి వచ్చేము, ఇరుక్కు పోయాము'' అని అనుకుంటున్నార్రా పిల్లలూ'' అంది పిన్ని మమ్మల్ని ఉద్దేశించి చిరునవ్వుతో...

''అమ్మమ్మా! తాతయ్య ఎప్పుడూ ఎవరో ఒకర్ని తిడుతూంటాడు కదా! కానీ ఇప్పుడెవర్ని తిడుతున్నాడో, ఎందుకు తిడుతున్నాడో నాకు ఏమాత్రం అర్థం కాలేదు'' అన్నాడు పెద్దాడు!

''ఇప్పుడు మీ తాతయ్య ఎవర్ని ఎందుకు తిడుతున్నారో ఆ స్టోరీ నీకు చెప్తా కానీ... ఇలా కూర్చొని మీరిద్దరూ ఇవి తినండి''అని కొన్ని జంతికలూ, అరిసెలూ, వాళ్ల ముందు ప్లేట్లో పెట్టి, తాను రాత్రి వంటకి ఆనపకాయ తరుగుతూ చెప్పడం మొదలుపెట్టింది పిన్ని.

★★★

''ఏమేవ్ తింగరబుచ్చి! కాస్త నా మొహాన కాఫీ పిండాకుడు తగలెయ్యి అర్జంటుగా'' అని పిన్నికి ఓ పొలికేకతో ఆర్డరేసిన బాబాయి, రోజులాగే పాచిముఖంతో పొద్దుటే వాకిట్లో కూలబడ్డాడు. పిన్నిచ్చిన కాఫీ తాగుతూ దండకం మొదలుపెట్టాడు.

''ఏయ్! ఏయ్! భయంలేని బద్మాషుల్లారా! అలా మా ముగ్గుని తొక్కుకుంటూ వెళ్లకపోతే ఏం? రోడ్డంతా ఖాళీగా వుంటే వదిలేసి మా వాకిట్లోంచే నడవడం ఎందుకురా పింజారీకుంకల్లారా! ఈసారి ముగ్గు తొక్కారంటే మీ కాళ్లిరిచి మా బాయిలర్లో పెడతాను గడుగ్గాయి సన్నాసులూ'' అంటూ అరిచేడు రోడ్డు మీద పోయే ట్యూషన్ పిల్లల్ని. మళ్లీ పనమ్మాయి అతనికళ్లబడేసరికి మరోసారి అందుకొని...

''ఏమేవ్ ఉప్పులాయి! ఏవిటా వాకిలి ఊడవడం? ఎక్కడి చెత్తక్కడే వదిలి చచ్చావ్! పైగా ఆ వెధవ డిజైన్ ముగ్గు తప్పితే మరోహాటి రాదటే కుంకాక్షి? చూసి చూసి అది వెయ్యడం నాక్కూడా వచ్చేసింది. మరోసారి ముగ్గేశావో, నీతో రథం ముగ్గు దగ్గరుండి వేయించేయగల్ను చింపిరి భడవా! హడి!హడి! ఆ దిక్కుమాలిన కుక్కముండని తోలి, గేటు గడీపెట్టి వెళ్లంట్లుతోము అంట్లకానా!! అని దులిపేసేడు పనమ్మాయిని!

ఆ హడావిడ్లో కుక్కనైతే తోలింది గానీ గేటు సరిగ్గా వెయ్యనట్టుందా పనమ్మాయి!

''గేటు వెయ్యమని చెప్పినా వినకుండా పోతావేమే ఇంటి పిల్లి రాకాసీ! ఆ వెధవ కుక్కలు మేమన్నం తినే కంచాలు నాకి పోతాయి. మేం మళ్లీ వాటిల్లోని తిండి తిని ఏ భయంకరమైన జబ్బో వచ్చి చచ్చిపోవాలనా నీ ఉద్దేశం ఏబ్రాసి గబ్బిలాయి!'' అని అరిచేసరికి బాబాయ్ని భస్మమయ్యేలా చూసి, ఆమె గేటేసి అంట్లు తోమడానికి లోనికెళ్లింది. పాపమా ఇంట్లో పని మానేద్దామని దానికున్నా, అభిమానంగా అన్నీ పెట్టే మా పిన్ని కోసమని అది మానలేకపోతోంది (ట)!

ఇంతలో ఇంట్లోకి బయటకొస్తున్న పిన్నీ, బయటే కూర్చున్న బాబాయీ ఒకేసారి వాకిట్లో గేటు చప్పుడవడంతో అటు చూశారు.

భర్తకి బాల్యమిత్రుడూ, తనకి వరసకి అన్నయ్యా అయ్యే గోపాల్రావు గారు చాన్నాళ్లకి తమ ఇంటికి రావడం చూసిన పిన్ని సంతోషంగా,

''రండన్నయ్యా! బాగున్నారా? ఇంట్లో అంతా కులాసానేనా?'' అని అడుగుతూ కుర్చీ చూపించింది కూర్చోవడానికి. అతనన్నింటికీ సమాధానంగా తలూపుతూ చిరునవ్వు నవ్వి కూర్చొని ఏదో చెప్పబోయేంతలో బాబాయందుకుని...

''బాగుండకపోతే ఇలా గేదెకు సూటు బూటు తొడినట్లు, టిప్పుటాపుగా రెడీ అయి మరీ మనింటికి ఎలా వస్తాడు? బడుద్ధాయి కుంకా? పిచ్చి వెధవ ప్రశ్నలేయకు. నాకొళ్లుమండుతుంది. 'కులాసానా? అంటావేంటి? వాడొస్తే మనకన్నీ లాసే, ఓ కప్పుడూ...కాదు... కాదు... ఓ లోటాడు కాఫీ పట్రా ఫో! వాడిదసలే మాంచి తిండి పుష్టి! నాకు మాత్రం కాఫీ తేకు, వాడి వసలే దిష్టి కళ్లు'' అని అరిచినట్టు చెప్పేడు తన ధోరణిలో మామూలుగానే!


''చాల్లే... ఊరుకోండి! ఇంటికొచ్చిన వాళ్లని కుశల ప్రశ్నలు కూడా వెయ్యమా?'' అని అటు గోపాల్రావుగారి వైపు తిరిగి ''ఈయన మాటలకి మీరేమనుకోకండన్నయ్యగారూ! ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో, ఎలా, మాట్లాడాలో ఇన్నేళ్లు వొంటికొచ్చినా అబ్బలే


విశ్వసించు - విజయాన్ని పొందు

తెలుగు/హిందీ/ ఆంగ్లంలో లభించే ఉచిత పుస్తకానికై నేడే మాకు వ్రాయండి.

అబండెంట్ లైఫ్ రిసోర్సెస్
పోస్ట్ బ్యాగ్ నెం. 24,
సికింద్రాబాద్ - 500 026.





వసుధ

ప్రారంభ సంచిక
ప్రత్యేక అనుబంధం


ఏప్రిల్, 2007 శ్రీరస్తు నిత్యం శుభమస్తు నిత్యం రూ. 20/-
ఆధ్యాత్మిక మాసపత్రిక

ధారావాహికలు
శ్రీమద్రామాయణం
శివపురాణం
సాయినాథ చరిత్ర
ఆముక్తమాల్యద
యాత్రానుభూతి



ప్రత్యేకవ్యాసాలు
దివ్యక్షేత్రం భద్రాచలం
పురాణాలు వాస్తవాలా? కల్పితాలా?
కనకధారాస్తోత్రమ్
అన్నవరం సత్యనారాయణ స్వామి
తోడునీడగా శివకేశవులు ఒంగోలు

వర్ణ చిత్రాలు, ఆలయాలు, శీర్షికలు ...




దాయనకి! ఉండండి కాఫీ తెస్తాను'' అని సర్ది చెప్పి లోనికెళ్లబోయింది.

''ఫర్వాలేదమ్మా చెల్లాయ్! నీ మొగుడి గురించి నీకు మీ పెళ్లాయ్యాకే తెలిసింది కానీ, వాడి గురించి నాకు నా చిన్నప్పట్నుంచీ తెలుసు. కాబట్టి వాడేదైనా వాగితే, నేనేమయినా అనుకుంటానేమోనని, నువ్వు దిగులుపడకు. లోటాడు కాఫీ తాగితే నాకు ఈ వయసులో పడదు కానీ, ఓ కప్పుడు కలుపు చాలు. షుగరు వెయ్యకు. దేవుడు ఆల్రెడీ కిలోలు, కిలోలు నా బాడీలో నిల్వ వుంచాడ్లే'' అంటూ హాయిగా నవ్వేస్తూ తనకిదంతా మామూలేనన్నట్లు చెప్పేడాయన. అతనె ళ్లేలోగా భర్త అతన్ని కనీసం ఓ ముప్పై తిట్లు తిట్టాడని లెక్క కట్టింది పిన్ని! అన్ని తిట్టినా గోపాల్రావు గారేమీ పట్టించుకోకపోగా తన కొడుకు పెళ్లికి రమ్మని ఇంటిల్లి పాదినీ సాదరంగా ఆహ్వానించి వెళ్లిపోవడంతో గట్టిగా నిట్టూర్చి ఊపిరి పీల్చుకుంది పిన్ని.

★★★

రెండ్రోజుల తర్వాత తనతో పాటు 'టింగు రంగా' మంటూ పెళ్లికి పట్టుపంచె కట్టి ముస్తాబవుతోన్న బాబాయిని చూసి ఓ పక్క ఆశ్చర్యం మరో పక్క భయం కలిగేయి పిన్నికి! ఏ పెళ్లికీ వెళ్లని బాబాయి ఈ పెళ్లికి బయల్దేరడమే పిన్ని ఆశ్చర్యానికి కారణమయితే ఇహ భయమెందుకంటే పెళ్లిలో ఎవర్ని తిట్టి ఏ తంటా నెత్తి మీదకి తెస్తాడోనని!

అంగరంగ వైభవంగా జరుగుతోన్న గోపాల్రావు అబ్బాయి పెళ్లిని చూసి సంతోషించాల్సిన సమయంలో పిన్ని మాత్రం మొగుడి నోటి దూలకి ఎవ్వరూ బలికాకూడదనే ఉద్దేశంతో అతన్నోకంట కనిపెడుతూనే వుంది. కానీ అక్షింతలు వేసే వేళకి మొగుడు పెళ్లి కూతురు, పెళ్లికొడుకు మీద వెయ్యాల్సిన అక్షింతలు తన్నెత్తిమీద వేసేడని పక్కవారితో గొడవపడతాడని ఏమాత్రం ఊహించలేకపోవడంతో పాపం గిఫ్టు ప్యాకు వాళ్లిద్దరి చేతిలో పెడదాం అనుకుని మండపంలోకి వెళ్లింది. ఆమె తిరిగి వచ్చేసరికి జరుగుతోన్న సీనేంటంటే...

''కళ్లు కనిపించట్లేదురా దగుల్బాజీ? ఊదిపారేసిన బీడీ మొహమేసుకుని అక్షింతలు నా నెత్తిమీద వేస్తున్నావ్? తింగరిసన్నాసీ!'' అంటున్నాడు బాబాయి. అవతలి వాడికి అంత క్విక్‌గా తిట్లు దొరక్క, అలాగని కోపమాపుకోనూలేక బాబాయ్‌కాలర్ పట్టుకోబోయాడు కళ్ల నుంచి నిప్పులు కురిపిస్తూ...

పిన్ని గబుక్కున చేతులు జోడించి ''ఆయన మాటలేం పట్టించుకోకండి! ఆయనక్కాస్త పిచ్చి'' అని బాబాయికి వినపడనంత మెల్లిగా చెప్పి, బాబాయిని ఇవతలకి లాక్కొచ్చింది పాపం.

భోజనాల దగ్గర ఆమె పరిస్థితి పెనం మీంచి పొయ్యిలో పడ్డట్టయింది. అక్కడంతా బఫే సిస్టమ్‌లో ప్లేట్లు పట్టుకుని హడావుడిగా వారిక్కావలసింది మాత్రం పెట్టుకొని గబగడా లాగించేయడం చూసిన బాబాయికి ఒళ్లు మండుకొచ్చింది. అక్కడ పెళ్లి తతంగమంతా తూతూ మంత్రంగా కానిచ్చేస్తే, ఇక్కడ భోజనాల దగ్గర విస్తట్లూ, వడ్డింపులు లేకపోగా అడుక్కుంటున్నట్లుగా వడ్డించే ప్రతి వాడి దగ్గరికీ వెళ్లి 'ఇంకొంచెం పెట్టు, మరికొంచెం వెయ్యి' అని ప్రాధేయపడడం ఆయనకస్సలు నచ్చలేదు. పైగా అక్కడ సాంప్రదాయక వంటలేవీ కనిపించకపోవడం, మంచినీళ్లకోసం ఆమడ దూరం చూసినా కనిపించకపోవడంతో అయనకి కోపం నషాళానికి అంటినట్టుంది. క్యాటరర్స్‌లో కాస్త పెద్ద వయస్సున్నవాడిగాను, సూటూ, బూటులో వుండి వారి మేనేజర్‌లాగాను కనిపిస్తున్న ఒకతన్ని పట్టుకు దులపడం మొదలుపెట్టేడు బాబాయ్!

''ఏరా ముదనష్టపు గబ్బిలాయ్? మేమంతా చక్కగా పంక్తిలో కూర్చుని సరదాగా ఛలోక్తులు వినురుకుంటూ ఆనందంగా భోంచేస్తుంటే నీ కళ్లు కుట్టుకుంటాయా కారం తిన్న కాకీ?''అన్నాడు కోపంగా! ఆ మాటలకి ఆ క్యాటరర్‌కి పట్టరాని కోపం వచ్చినా, మ్యానర్స్ వదిలేయకూడదన్న వారి నియమంతో ''ఇది బఫే సిస్టమండీ! ఇక్కడ ఇలాగే భోజనం చెయ్యాలి?'' అని పాపం సర్దిచెప్పబోయాడు.

కానీ బాబాయ్‌ని సమాధాన పరచగలిగిన వాడు ఇంకా పుట్టలేదుకదా!

''బఫే! బఫే అంటూ బఫెల్లోస్‌లా రాసుకుంటూ, పైగా అన్నం దగ్గర్నుండీ నీళ్ల వరకూ అడుక్కుతినమని నిర్ణయించడానికి నువ్వెవడివోయ్ దున్నపోతుకి అన్నయ్యవా? అయినా పెళ్లికి పులిహోర, బూర్లు లేకుండా, ఈ బిర్యానీలు, బటానీ కూరల్తో విందేవిటోయ్ నీ బొందలాగా తాగిపారేసిన బోండా ఫేసూ నువ్వూనూ''అని కిందా మీదా కడిగిపారేశాడత గాడ్ని! పాపమా క్యాటరర్ ఇతని ధాటికి నోరు మెదపకుండా నిల్చుండిపోయాడు. తన తప్పేం లేకపోయినా! అతడూరుకున్నా చుట్టుపక్కల తింటున్న వాళ్లు మాత్రం బాబాయ్‌ని దురదగుండాకు ఒంటికి రాసుకున్నట్లు చిరాగ్గా మొహం పెట్టిచూడడం గమనించి, అప్పటికే అతన్ని అక్కడణ్నించి తీసుకుపోదామని శతవిధాలా ప్రయత్నిస్తున్న పిన్ని ఇహ వుండబట్టలేక ''మీరింక ఇక్కడ్నుంచి పదండి'' అంటూ బాబాయి చెయ్యిపట్టుకుని లాగేసిందివతలకి! అయితే అక్కడే నిలబడి భోజనాన్ని అరమోడ్పు కన్నులతో ఆస్వాదిస్తున్న ఓ బండ శాల్తీని బాబాయి ఆ విసురుకి గుద్దేయడంతో పిన్ని తమకి అతనితో అక్షింతలు తప్పవనుకొని హడలిపోయింది. అయితే పాపం ఆ సదరు శాల్తీ ఇదేమీ పట్టించుకోకుండా తన మానాన మళ్లీ తినడం మొదలుపెట్టేడు! కానీ బాబాయి మాత్రం ఊరుకోకుండా..

''పర్వతంలా వొళ్లేసుకొని దారికడ్డంగా నిల్చుంటావేరా అడ్డగాడిదా? గున్న ఏనుక్కి అన్నలాగా, బండరాయికి బామ్మరిదిలా తెగ బలిశావు! ఇలా దారులకడ్డంగా నించోవడానికి నువ్వేమైనా సెలయేట్లో గులకరాయి సైజనుకున్నావా. లేకపోతే అడ్డదారిలో గడ్డిమొక్కలా పీలగా వున్నాననుకుంటున్నావా? తప్పుకో అవతలకి. తలమాసిన కుంకా!'' అంటూ ఆదిరిపోయేలా కసిరి ''నువ్వురావే నెలతక్కువ పక్షీ! అసలిదంతా నీవల్లే''అంటూ చేతిలో పళ్ళేన్ని పక్కన పెట్టి పెళ్లాన్ని వెంటపెట్టుకుని కదిలాడక్కడ్నించి! ఇద్దరూ ఇంటికి చేరేసరికి పిన్నికి గోవర్ధన పర్వతం నెత్తిమీంచి వేరేచోటికి దింపినట్లయ్యి, ఊపిరి పీల్చుకుని ఉస్సు... రంటూ నిట్టూర్చింది.

★★★

''ఇదిరా కథ! మీ బాబాయికి ఇది గుర్తొచ్చినప్పుడల్లా ఉన్నట్లుండి గోపాల్రావు అన్నయ్యని తిట్టడం మొదలుపెడతారు. ఎందుకంటే అతను పిలవడం వల్లే కదా మేమక్కడికి వెళ్లింది'' అంది. మళ్లీ తనే నాతో ''పాపమన్నయ్యగార్ని కలవనే లేదు సుశీ! ఆ పెళ్లి హడావుడిలో అతనుంటే మీ బాబాయి సందట్లో పడి నేను అతన్ని పలకరించనే లేదు. పోన్లే అదీ ఒకందుకు మంచిదే, కలిస్తే గనక ఈయన పాపమాయిన్ని అక్కడే తిట్టిపోసేద్దురు. అతని కొడుకు పెళ్లనైనా చూడకుండా!'' అంది. మేమేమీ మాట్లాడకుండా నవ్వేం!

''మీరైనా పిలవగానే వచ్చేరు. మీ ఆయనకి ఎంతైనా నేనంటే అభిమానంలే! లేకపోతే ఈయన సంగతి తెల్సి మిమ్మల్నెలా పంపుతాడు?'' అని కూడా అంది పిన్ని! నేనేదో చెప్పబోయే లోగానే బాబాయి మాటలు వినపడ్డాయి మాకు!

''ఆ చవలాయి, ఆ బడుద్ధాయి, ఆ వాగుడుకాయి, ఆ నీల్గుడు నిమ్మకాయిగాడు, ఓ సంప్రదాయమూ, చట్టుబండలూ లేకుండా చేస్తున్న వాడి కొడుకు పెళ్లికి నన్ను పిల్చేడే అనుకో తోకూపుకుంటూ వెనకే నే వెళ్లాననుకో నేనెంత పిచ్చికుక్కనో... నేనెంత వాజమ్మనో.... నాకే అర్థం కావట్లేదు''

★